

ఉదయం వేడి... సాయంత్రం చల్లదనం

పలుచోట్ల ఈదురుగాలులతో వర్షం

శ్రీకాకుళం : ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఉదయం నుంచీ అల్లాడిన జనాలపై వరుణుడు కరుణించాడు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, రణస్థలం, లావేరు, జి.సిగడాం, పొందూరు, వజ్రపుకొత్తూరు తదితర మండలాల్లో చిరుజల్లుల నుంచి భారీ వర్షం కురిసింది. భారీగా వీచిన ఈదురుగాలులకు మామిడి నేలరాలగా, అరటి చెట్లు నేలవాలాయి. ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలులు, వర్షం తగ్గాక విద్యుత్‌ను పునరుద్ధరించారు.

'మడ్డువలస' పనులు ఊపందుకునేనా?

- రెండో దశ పనులను ప్రారంభించిన కొత్త నిర్మాణ సంస్థ
- వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి చేసేలా ఒప్పందం
- మట్టి పనులు తొలుత పూర్తి చేయాలని లక్ష్యం
- ఈ ఏడాది కొంతమేర నీళ్లు వదిలేలా ప్రణాళిక

ఎట్టకేలకు గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస రిజర్వాయర్ రెండో దశ పథకం పనులు ప్రారంభమయ్యాయి. సుమారు మూడు సంవత్సరాల అనంతరం కొత్త నిర్మాణ సంస్థ పనులు మొదలు పెట్టింది. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన మడ్డువలస పునఃప్రారంభ పనులకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు పనులు 2009లో ప్రారంభమై 2020 జులై వరకు సాగాయి. ఈ ప్రాజెక్టు పనులు సుమారు 79 శాతం మేర పూర్తయ్యాయి. ఇంకా 21 శాతం పనులు మిగిలి ఉండగా, అప్పటివరకు పనులు చేస్తున్న నిర్మాణ సంస్థతో ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. మిగిలిన పనులకు టెండర్లను పిలిచి కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగించడంతో, పనులు మొదలు కావడానికి అవకాశం కలిగింది. కొత్త ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాది ఏప్రిల్ లోగా పనులు పూర్తి చేయాల్సి ఉండడంతో, ఖరీఫ్‌కు నీళ్లు అందించడంపై ఆశలు రేకెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మడ్డువలస జలాశయ రెండో దశ పథకాన్ని నిర్మించాలని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 6, 2009లో రూ.57.87 కోట్లకు పరిపాలనా ఆమోదం కూడా తెలిపింది. జి.సిగడాం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, మండలాల్లోని 24,954 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దీంతో మొత్తం 21 గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నారు. పథకం నిర్మాణ బాధ్యతలను విశాఖపట్నానికి చెందిన పి.జె.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్లలో రూ.47.3933 కోట్లకు దక్కించుకుంది. మార్చి 2, 2009న ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం పనిని 24 నెలల కాలంలో పూర్తి చేయాల్సి ఉంది. అంటే మార్చి 2, 2011 నాటికే పనులు పూర్తయి రైతులకు సాగునీరు అందించాల్సి ఉంది. ఒప్పంద కాలపరిమితులు పొడిగిస్తూ ప్రభుత్వం వరుసగా ఆరు పర్యాయాలు అవకాశం ఇచ్చింది. చివరిసారిగా కాలపరిమితిని జూన్ 30, 2018 వరకు పొడిగించింది. అధికారిక లెక్కల ప్రకారం 78.36 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 21.64 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఒప్పందం విలువ రూ.47.393 కోట్లలో రూ.37.14 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం సంబంధిత నిర్మాణ సంస్థ పనులు నిలుపుదల చేసింది. దీంతో ప్రభుత్వం జులై 8, 2020లో సంబంధిత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని ముగించింది.



లావేరు మండలం కొత్తకొంకాం వద్ద తవ్వి వదిలేసిన కాలువలు

కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగింత

రిజర్వాయరు పనులు చేపట్టిన పిజెఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఇప్పటివరకు 78.36 శాతం మేర పనులు పూర్తి చేసి వైదొలగింది. మిగిలిన 21.64 శాతం పనులు చేసేందుకు కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు మిగిలిన పనులకు కొత్త రేట్లకు అనుగుణంగా అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం వాటికి ఆమోదం తెలిపి రూ.26.90 కోట్లను మంజూరు చేస్తూ 2022 ఏప్రిల్ 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. స్టేజ్-2లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన బిఎస్‌బి ఇన్‌ఫ్రా ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.23.83 కోట్లతో టెండర్లను దక్కించుకుంది.

పనుల వేగవంతానికి చర్యలు చేపడుతున్నాం

మడ్డువలస జలాశయం స్టేజ్-2 పనులు ఊపందుకుంటున్నాయి. రెండో దశ పనులు వేగవంతానికి అవసరమైన చర్యలను చేపడుతున్నాం. ఈ ఖరీఫ్‌కు కొంతమేర నీళ్లు ఇవ్వడానికి తొలుత మట్టి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆ తర్వాత కాలువలో నిర్మాణ పనులు చేపడతాం. వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తి చేసి ఖరీఫ్‌కు నీళ్లిస్తాం.

- పి.సుధాకరరావు,
కార్యనిర్వాహక ఇంజినీర్, ప్రత్యేక కట్టడాల విభాగం

కార్మిక సమస్యలపై సమరశీల పోరాటాలు

- సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు
- ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - రణస్థలం, పలాస

కార్మికుల సమస్యలపై సిఐటియు సమరశీల పోరాటాలు సాగిస్తోందని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రణస్థలం మండలం పైడిభీమవరంలోని పారిశ్రామికవాడలో రెడ్డీస్ లేబొరేటరీస్, యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమల వద్ద సిఐటియు పతకాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ఆవిష్కరించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలోని కాశీబుగ్గ హైస్కూల్ రోడ్డులో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యత, పోరాటం నినాదంతో 1970 మే 30న సిఐటియు ఆవిర్భవించిందని తెలిపారు. 1970వ దశకంలో రైల్వే కార్మికులను ఐక్యం చేసి 20 రోజుల సమ్మెతో కేంద్ర ప్రభుత్వాన్ని గడగడలాడించిన దశ నుంచి నేడు కార్మిక సంఘాలన్నింటినీ ఐక్యం చేసి ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేక పోరాటంలో అగ్రభాగాన నిలుస్తోందన్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలపై రాజీ లేని పోరాటం చేసిందని గుర్తుచేశారు. బిజెపి ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాల కంటే అదానీ, అంబానీ ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తూ కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలను ఐక్యపరచి పోరాడడంతో సిఐటియు తనవంతు పాత్ర పోషిస్తోందని చెప్పారు. కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని కొనసాగుతున్న ఉద్యమం వల్ల మోడీ ప్రభుత్వం వాటిని అమలు చేయలేకపోతోందని చెప్పారు. పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా విశాల కార్మికవర్గ ఐక్యత కోసం సిఐటియు కృషి చేస్తోందన్నారు. కార్మికులు ఐక్యం కాకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు చేపట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడం ద్వారా దోపిడీ, పీడన లేని సమాజం సిఐటియు లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మురగన్, రవి, రమేష్, రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.బంగారునాయుడు, యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు



పలాస : సిఐటియు పతాకాన్ని ఆవిష్కరిస్తున్న గణపతి



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

జీడి రైతులకు అన్యాయం

- మద్దతు ధర లేక దోపిడీకి గురవుతున్న రైతులు
- బస్తాకు రూ.16 వేలు ఇవ్వాలి
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన్న కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు జీడి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి విమర్శించారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా చేస్తామంటూ నిరంతరం ప్రచారం చేస్తున్న ప్రభుత్వం, జీడిపిక్కలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో జీడి రైతులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గతం కంటే జీడి పిక్కల ధర తగ్గిందని, అదే సమయంలో జీడిపప్పు ధర మాత్రం పెరిగిందని చెప్పారు. దీనివల్ల అటు రైతులు, ఇటు వినియోగదారులు నష్టపోతున్నా, ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. మద్దతు ధర కోసం జీడి రైతులు చేస్తున్న పోరాటాలకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోతే జీడి రైతులతో కలిసి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

స్పీకర్‌ను అరెస్టు చేయాలి

- చంద్రబాబుపై వ్యాఖ్యల వెనుక కుట్రను ఛేదించాలి
- పోలీసులకు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆమదాలవలస

జెడ్ ప్లస్ భద్రతను తీసేస్తే చంద్రబాబు ఫినిష్ అంటూ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చేసిన వ్యాఖ్యల వెనుక ఉన్న కుట్ర కోణాన్ని ఛేదించి, ఆయన్ను అరెస్టు చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ వై.కృష్ణకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవికే కళంకం తెచ్చిన వ్యక్తి సీతారాం అని విమర్శించారు. చంద్రబాబు నాయుడును విమర్శిస్తే జగన్మోహన్ రెడ్డి మెప్పు పొందవచ్చన్న దుర్బుద్ధితో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు భద్రతకు ఎలా అర్హుడని ప్రశ్నించడానికి తమ్మినేనికి ఉన్న అర్హత ఏమిటని ప్రశ్నించారు. ఫేక్ సర్టిఫికెట్లతో డిగ్రీ పాసైన అజ్ఞానులకు నియమ నిబంధనలు ఏవిధంగా తెలుస్తాయని ఎద్దేవా చేశారు. వైసిపి రక్త చరిత్ర పునాదుల మీద ఏర్పడి అధికారంలోకి వచ్చిందని, అందుకే స్పీకర్ వ్యాఖ్యల నేపథ్యంలో చంద్రబాబుపై ఏదో కుట్ర ఉందన్న అనుమానం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డిని హత్య చేసి మొసలికన్నీరు కార్చి అధికారంలోకి వచ్చిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. గతానుభవాల దృష్ట్యా సీతారాంను అదుపులోకి తీసుకుని విచారణ చేసి, కుట్ర కోణాన్ని బయటపెట్టాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఇప్పటికే తమ్మినేని సీతారాం ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్‌పై తెలంగాణలోని ఎల్‌బి నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అక్కడ కేసు నమోదైందన్నారు. రాష్ట్రపతికీ ఫిర్యాదు చేశానని, ఈ వ్యవహారంపై విచారణ చేయాలని సిఎస్‌కు ఆదేశించినట్లు తనకు రాష్ట్రపతి భవన్ నుంచి ప్రత్యుత్తరం వచ్చిందన్నారు. త్వరలోనే సీతారాంకు జైలు శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నూకరాజు, తమ్మినేని చంద్రశేఖర్, బోర గోవిందరావు, బోనెల అప్పారావు, సనపల చెల్లం నాయుడు, గురుగుబెల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ కృష్ణకు ఫిర్యాదు చేస్తున్న రవికుమార్

నేడు మున్సిపల్ బస్సు జాతా

శ్రీకాకుళం అర్బన్ : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యాన బస్సు జాతాను నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అనంతపురం జిల్లా హిందూపురం నుంచి ఒక జాతా, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి మరో జాతా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇచ్ఛాపురంలో ఈ జాతాను బుధవారం ఉదయం పది గంటలకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

జాతా అక్కడ్నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు పలాస మున్సిపాల్టీ, రెండు గంటలకు శ్రీకాకుళం నగరపాలక సంస్థకు చేరుకుంటుందని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆమదాలవలస మున్సిపాల్టీతో జిల్లాలో జాతా ముగిసి, సాయంత్రం ఆరు గంటలకు పాలకొండ నగర పంచాయతీకి చేరుకుంటుందని వివరించారు. జాతా ప్రారంభ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు.

ప్రజా వైద్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం

గార : ప్రజా వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని శ్రీకూర్మంలో రెడ్డీస్ లేబొరేటరీస్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్మించిన అప్‌గ్రేటెడ్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబం ఆరోగ్యం కోసం ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ఆరోగ్యశ్రీ ఖరీదైన వైద్యం పేదలకు ఉచితంగా అందుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల గుమ్మం వద్దకే వైద్యాన్ని తీసుకొచ్చామని చెప్పారు. రానున్న కాలంలో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంపొందించుకునే విధంగా అన్ని చర్యలూ చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పలుచోట్ల అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. రిమ్స్‌ను, టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రిని అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. అదనపు పకడలనూ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విలేజ్ క్లినిక్‌లనూ నెలకొల్పామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్‌కు నిధులు సమకూర్చిన రెడ్డీస్ ల్యాబ్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, రెడ్డీస్ లేబొరేటరీ చైర్మన్ షామిక్, ఇన్‌ఛార్జి హెల్త్ అండ్ న్యూట్రిషియన్ శ్రీనివాస్, డైరెక్టర్ కార్పొరేట్ అఫైర్స్ రాజు, ఎంపిపి గొండు రఘురాం, వైద్యాధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం వైపు దేశం చూపు

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

ఆంధ్రప్రదేశ్‌లో పాలనను దేశం మొత్తం గమనిస్తోందని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఇక్కడ అమలు చేస్తున్న అన్ని పథకాలను ఏదో ఒక రూపంలో తమ రాష్ట్రంలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వ పాలన నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నరసన్నపేట మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం కేకు కట్ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను దాదాపుగా ఈ నాలుగేళ్ల పాలనా కాలంలో అమలు చేసి జగన్ చరిత్ర సృష్టించారని చెప్పారు. ఈ నాలుగేళ్లలో ప్రజలందరికీ సంక్షేమాన్ని సుసాధ్యం చేసిన జగన్, ఈ ఏడాదిలోనూ మరిన్ని అద్భుతాలు చేయబోతున్నారని చెప్పారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, వాన గోపి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కృష్ణదాస్



జన హృదయ నేత రాజగోపాలరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జన హృదయ నేత మాజీ ఎంపీ, కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రాజగోపాలరావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కొత్త రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఒక కళ్యాణ మండపంలో నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో రాజగోపాలరావు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. అయన ఆదర్శ రాజకీయ జీవితం రాబోయే తరాలకు ఆదర్శం కావాలన్నారు. ఆరుసార్లు ఎంపీగా ఎన్నికైన ఆయన జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ఆమదాలవలసలో సహకార చక్కెర కర్మాగారం, నైర, రాగోలు, ఆమదాలవలసలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయించడంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ఎపి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఫెడరేషన్ చైర్మన్ ఎ.వి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రిమ్స్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు రూ.16 వేలు అమలు చేయాలని ఎపి కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిమ్స్ హాస్పిటల్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వీరంతా పనిచేస్తున్నా అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని చెప్పారు. కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చెల్లించాల్సిన మినిమం వేజ్ చెల్లించడం లేదన్నారు. సమగ్ర శిక్ష, నేషనల్ హెల్త్ మిషన్ తదితర ప్రభుత్వ పథకాల్లోని కాంట్రక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్‌ను అమలు చేయడం లేదని విమర్శించారు. కాంట్రాక్టు, టైమ్‌స్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం లేదన్నారు. తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో రెగ్యులరైజ్ చేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సిలోని కనీస వేతనం రూ.20 వేల వేతనం అమలు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు, ఎన్‌హెచ్ఎం, అన్ని ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వరంగ సంస్థల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ తదితర అన్ని కేడర్లకు మినిమం వేజ్, డిఎను అమలు చేయాలన్నారు. ఆప్కాస్‌లోని ఉద్యోగులందరికీ ఒక కార్పొరేషన్‌లో వర్తించే సౌకర్యాలన్నింటినీ వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ యూనియన్ జిల్లా నాయకులు డి.మురళి, రిమ్స్ యూనియన్ నాయకులు సూర్యనారాయణ, సంతోషి, చిన్నారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై మరో పోరాటం

- ఉద్యమంలో భాగస్వామ్యం కావాలి
- ఎంపీని కోరిన రైతుసంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాట సమయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆ చట్టాలను రద్దు చేయడంతో పాటు ఐదు అంశాలను పరిష్కరిస్తామని రాతపూర్వక హామీనిచ్చిందని ఎపి రైతుసంఘాల సమన్వయ సమితి నాయకులు గుర్తు చేశారు. ఏడాదిన్నర గడిచినా వాటిని అమలు చేయకుండా తిరిగి రద్దు చేసిన వాటినే అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో రైతాంగం ఎదుర్కొంటున్న కీలక సమస్యల పరిష్కారం కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా మరో దీర్ఘకాలిక పోరాటానికి సమాయత్తం అవుతోందని తెలిపారు. ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరుతూ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరారు. నగరంలోని ప్రజా సదన్‌లో ఎంపీని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రైతాంగ సమస్యలపై పార్లమెంట్‌లో వాణిని వినిపించాలని కోరారు. అన్ని పంటలకూ స్వామినాథన్ సూచించిన ప్రకారం మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలన్నారు. రైతాంగానికి ఉన్న ప్రయివేటు అప్పులతో సహా బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని, కేరళ తరహా రుణ ఉపశమన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు అమర్చడం సరికాదని, వాటిని తక్షణమే తొలగించాలన్నారు. 60 ఏళ్లు దాటిన రైతులు, కౌలు రైతులకు నెలకు రూ.ఆరు వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమం సందర్భంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని, చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. లఖింపూర్ ఖేరి హత్యాకాండకు బాధ్యుడైన అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీని కలిసిన వారిలో సమితి నాయకులు తాండ్ర ప్రకాష్, కె.మోహనరావు, వంకల మాధవరావు, డి.షణ్ముఖరావు, పి.వరప్రసాదరావు తదితరులున్నారు.



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న సమితి నాయకులు

అరుణాచలగిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

శ్రీకాకుళం అర్బన్ : తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణ మహోత్సవాలకు శ్రీకాకుళం నుంచి సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ రెండో తేదీన మధ్యాహ్నం 12 గంటలకు బస్సు శ్రీకాకుళం బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి 3న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్, కంచి దర్శించుకుని నాలుగో తేదీన ఉదయం అరుణాచలం చేరుతుందని తెలిపారు. అరుణాచల గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం సాయంత్రం బయలుదేరి ఐదో తేదీ సాయంత్రానికి శ్రీకాకుళం చేరుతుందని పేర్కొన్నారు. టిక్కెట్ ధర 4,500గా నిర్ణయించినట్లు తెలిపారు. టిక్కెట్లు కావాల్సిన వారు శ్రీకాకుళం బస్ స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో గానీ www.apsrtconline.com ద్వారా గానీ కొనుగోలు చేయొచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7382921647, 7601038583 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.


మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జగనన్న లేవుట్‌లోని ఇళ్లు ప్రారంభించని లబ్ధిదారులకు ఆర్‌పిలు అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్ అధ్యక్షతన మంగళవారం జగన్న ఇళ్ల నిర్మాణ పనులపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం విషయంలో లబ్ధిదారులకు ఉన్న అపోహలు తొలగించి అన్ని మౌలిక సదుపాయాల కల్పిస్తారని చెప్పి భరోసా కల్పించాలన్నారు. సకాలంలో బిల్లులు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, ఎప్పటికప్పుడు పరిశీలించి బిల్లులు మంజూరు చేయాలని సూచించారు. ఈ విషయంపై హౌసింగ్ ఎఇ ప్రసాద్‌కి అడుగగా, బిల్లులు చెల్లింపు విషయంలో సమస్యలు లేవని, బిల్లులు పెట్టిన వారం రోజుల్లోనే చెలిస్తున్నామని తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంత మందికి బిల్లులు చెల్లింపులు జరగడం లేదని అన్నారు. వాళ్లకీ త్వరలో బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. విద్యుత్ మీటర్లపై ఎఇ గోవిందరావును ప్రశ్నించగా... విద్యుత్ మీటర్లు ఉచితంగా ఇస్తారని ఇస్తున్నామని, ఇళ్లు పూర్తయి చేసిన తరువాత తన దృష్టికి తీసుకొస్తే... సర్వీస్ వైర్ కూడా ఉచితంగా ఇస్తారని సమాధానం చెప్పారు. కార్యక్రమంలో టౌన్ సర్వేయర్ తవిటినాయుడు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న రాజ్యలక్ష్మి

జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని వైఎస్ఆర్ మున్సిపల్ కళ్యాణ మండపంలో జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను మున్సిపల్ చైర్మన్ పి.రాజ్యలక్ష్మి, సిఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్, కమిషనర్ రమేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం, వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 110 మంది విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. సిహెచ్.దుర్గాప్రసాద్, జిల్లా ఇండియా తైక్వాండో అసోసియేషన్ సెక్రెటరీ ఆధ్వర్యాన ఈ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైరపర్సన్ భారతీ దివ్య, పిలకా విజయ్, కాళ్ల దిలీప్‌కుమార్, దాసరి రాజు, పిఇటి అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణయ్య, ఎల్.సి.రావు, జి.చరణ్, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలకు వందనం

ప్రజాశక్తి- ఆమదాలవలస

వాలంటీర్లు అంటే స్వచ్ఛంద సేవకుడని, ఆ సేవకుడు చేసిన సేవలు వెలకట్టలేనివని, అటువంటి వారిని ప్రభుత్వపరంగా గౌరవించడమే వాలంటీర్లకు వందనం కార్యక్రమమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో మండలానికి సంబంధించిన వాలంటీర్లకు సేవ వజ్రా, సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, సర్పంచ్‌లు తమ్మినేని వాణిశ్రీ, మెట్ట శారద, గురుగుబెల్లి నీలారావు, చిలకలపల్లి సురేష్, కనుగుల కిషోర్, చల్లా సింహాచలం, సోమరాజు తేజ, దశరథ, ఎన్ని చంద్రయ్య, గొంటి కృష్ణ, ఎంపిటిసి కుటికుప్పల సన్యాసిరావు, పొన్నాడ అనసూయమ్మ, తాండ్ర ధనంజయరావ్, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు.


గార : వాలంటీర్లను సన్మానిస్తున్న మంత్రి ధర్మాన

గార : నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్న వాలంటీర్లను గౌరవించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలం శ్రీకూర్మం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వాలంటర్లకు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి గొండు రఘురాం, సర్పంచ్ జి.అనిత, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, ఎఎంసి మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, పీస గోపి, పీస శ్రీహరి, ముంజేటి కృష్ణ, పృథ్వీ, యళ్ల నారాయణ పాల్గొన్నారు.


ఆమదాలవలస : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

టెక్కలి రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా వాలంటీర్లు కృషి చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. వాలంటీర్ల వందనం కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు సేవా పురస్కరాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి అట్లా సరోజనమ్మ, సర్పంచ్ గొండెలి సుజాత పాల్గొన్నారు.

నందిగాం : జగన్ బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైసిపి కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, వైస్ ఎంపిపి ప్రతినిధి ఆర్.కూర్మారావు, ఎంపిటిసి అంబోడి విష్ణు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో ప్రజారంజక పాలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రంలో భారీ మెజారిటీతో అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన అందించి సర్వత్రా ప్రశంసలు అందుకుంటున్నారని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ అన్నారు. వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టి విజయవంతంగా నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని లొద్దపుట్టి పంచాయతీలో 'జగనన్న' ప్రజాప్రస్థానం విజయస్థూపం వద్ద, 'జగనన్న సంతకానికి' నాలుగేళ్లు నిండిన సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ముందుగా వైఎస్ఆర్ చిత్రపటానికి


ఇచ్ఛాపురం: కేక్ కట్ చేస్తున్న సాయిరాజ్

పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యకమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, సీడ్ ఏపి చైర్మన్ సాఢి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ దేవరాజ్, ఎంపిపి బోర పుష్ప, కంచిలి ఎంపిపి పైలా దేవదాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్.బాబూరావు, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, కారంగి మోహనరావు, చాట్ల తులసీదాస్‌రెడ్డి, ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.


కవిటి : వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రామారావు

కవిటి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా.. ప్రజల సంతోషమే ముఖ్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన ప్రారంభమై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కొత్తపుట్టుగలో వైఎస్ఆర్ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి చేస్తున్న సంక్షేమ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎన్.చామంతి, వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పులకల శ్రీరాములు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ ముఖ్యమంత్రి జగన్ ప్రమాణం స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన నందర్భంగా వైఎస్ఆర్ విగ్రహం వద్ద కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎపిపి అట్టా సరోజనమ్మ, సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


టెక్కలి రూరల్ : కేక్ కట్ చేస్తున్న వాణి

నేడు స్పీకర్ ఓనిగెడ్డ పరిశీలన

బూర్జ : బూర్జ మండల రైతులకు జీవనాధారమైన వెగవాడ వద్ద ఉన్న ఓనిగెడ్డను శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ బుధవారం పరిశీలిస్తారని వైసిపి మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఓనిగెడ్డ పరివాహక ప్రాంతాలకు చెందిన రైతులు, నాయకులు పాల్గొని సమస్యను వివరించారు. సాగునీరు అందించాలని, మరమ్మతులకు నిధులు కేటాయించాలని స్పీకర్‌కు, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయాలని సూచించారు.


మాట్లాడుతున్న గణపతి

కార్మికుల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- పలాస

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు బకాయిపడిన రెండు నెలల జీతం, మూడు నెలలు హెల్త్ అలవెన్స్ బకాయిలు జూన్ 1న నాటికి చెల్లించాలని, లేకుంటే 2 నుంచి పనులు నిలుపుదల చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అన్నారు. మున్సిపల్ కార్మికుల సమావేశం సిహెచ్.మురగన్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పిఎఫ్ బకాయిలు కోసం పనులు బంద్ చేస్తే కమిషనర్, చైర్మన్ ఇరవై రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి మూడు నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీ నెరవేర్చాలేదని అన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కారం చేయని పక్షంలో పనులు బంద్ చేస్తామని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎస్.రవి, ఎన్.రమేష్, ప్రకాష్, రాజ్ కిషోర్, శకుంతల, నాని పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

టెక్కలి: స్థానిక భవానీ నగర్ ప్రాంతానికి వెళ్తున్న మార్గంలో సర్వే నంబరు 468లోని 2018లో ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అప్పట్లో మంత్రిగా ఉన్న సమయంలో ఒక్కో సంఘం భవన నిర్మాణానికి ఐదు సెంట్లు చొప్పున స్థలం కేటాయించారని పట్టణంలోని పట్టుశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్లిపెద్ది మధు, సోండి కులసంఘం కార్యదర్శి జి.వి.నాగభూషణ్, బ్రాహ్మణ సంఘం కార్యదర్శి రామమని రమేష్‌కుమార్ తెలిపారు. ఇదే విషయమై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ని కలిసి స్థలం దురాక్రమణపై మంగళవారం ఫిర్యాదు చేశామని అన్నారు. ఆయన స్పందించి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇప్పుడు ఈ స్థలం తమదే అని భావిస్తూ యర్ర భైరాగి కంచే వేసి, బిల్డింగ్ పెట్టి మెటీరియల్ వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థలం 1976 నుంచి తమ ఆధీనంలో ఉందని, 2017లో కోర్టు పర్మినట్ డిక్రీ తమకు ఇచ్చిందని నోటీసు బోర్డు బోర్డులో పేర్కొన్నారని అన్నారు. ఐదేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు తమకు పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. రెవెన్యూ అధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఖాళీలు బ్లాక్ చేయడం తగదు

టెక్కలి : ఉపాధ్యాయ బదిలీల్లో ఉన్న ఖాళీలను బ్లాక్ చేయడం సమంజసం కాదని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కురమాన దాలయ్య అన్నారు. ఈ మేరకు యుటిఎఫ్ మండలశాఖ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 బదిలీ ఖాళీగా ఉన్న అన్ని పోస్టులనూ సమాంతరంగా చూపించాలన్నారు. బ్లాక్ చేసి కొన్ని పోస్టులను మాత్రమే బదిలీలకు అవకాశం కల్పించడం తగదన్నారు. రూ.2,500 వేతనం ఇస్తూ... ఉద్యోగోన్నతులు కల్పించి తర్వాత రద్దు చేయడమే గాకుండా వారి సర్వీస్‌నీ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. 2005 డిఎస్‌సి ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్ల సర్వీస్ పాయింట్లు ఇవ్వాలన్నారు. ఉద్యోగోన్నతులు మ్యానువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు డి.లక్ష్మీనారాయణ, పొట్నూరు జగదీశ్వరరావు, కోశాధికారి రోణంకి విజయ్‌కుమార్, తమ్మినేని వైకుంఠరావు, మారం కుమారస్వామి, వై.గణపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి గోపి

కాలువల్లో పూడికలు తీయించాలి

జలుమూరు : ఉపాధి హామీ ద్వారా వంశధార ఓపెన్ హెడ్ మేజర్ 18 ఆర్, పది ఆర్, 19 ఆర్, 20 ఆర్ కాలువలు, అనుబంధ కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తీయించాలని ఎంపిపి వాన గోపి అన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయంలో ఎన్ఆర్ఒజిఎస్, వంశధార అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వస్తున్న ఖరీఫ్ సీజన్‌లో కాలువల ద్వారా శివారు భూములకూ సాగునీరు అందించేందుకు ఆయా కాలువల్లో ఉన్న గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. అవసరమైన చోట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సహకారంతో మండల పరిషత్ నిధులు మళ్లించి రైతులకు సాగునీరు ఇబ్బందులు చేస్తామన్నారు. కార్యక్రమంలో వంశధార డిఇఇ బగ్గు సత్యనారాయణ, అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షులు మొజ్జాడ శ్యామలరావు పాల్గొన్నారు.

పల్లెల్లో సంబరాల సందడి

వజ్రపుకొత్తూరు: మండలంలోని పలు పల్లెల్లో సంబరాలు సరదాలు హోరుగా కనువిందు చేస్తున్నాయి. మండలంలోని పెద్దబొడ్డపాడు, లింగాలపాడు, డోకులపాడు గ్రామాల్లో మంగళవారం వేసిన పగటి వేషాలు చూపరులను అలరించాయి. గ్రామ దేవతల ఉత్సవాలు స్థానిక ఉత్సవ కమిటీ సర్పంచ్‌ల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహిస్తున్నారు. మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక యువత వివిధ వేషధారణలతో కనిపించి తమ అభిరుచిని చాటుకున్నారు. స్నేహితులతో, బంధువులతో పై గ్రామాలు కిక్కిరిసిపోయాయి.


ముర్రాటలను తీసుకెళ్తున్న మహిళలు

కూలిన వంతెన శిథిలాలు తొలగింపు


శిథిలాలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో బాహుదా నదిపై ఉన్న రోడ్ వంతెన కుప్పకూలి నెల రోజులు కావస్తున్నా... 'వంతెన పునరుద్ధరణ పనులు జాప్యం'పై ఈ నెల 30న ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై తహశీల్దార్ గురుప్రసాద్, ఆర్అండ్‌బి అధికారులు మంగళవారం కూలిన వంతెన శిథిలాలను ప్రొక్లెయినర్‌తో తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ త్వరలో తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా వంతెన పునురుద్ధరణ పనులు వేగవంతం చేస్తామని సీడ్ ఎపి చైర్మన్ సాఢీ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వంతెన వద్ద జరుగుతున్న శిథిలాలు తొలగింపు పనులు పరిశీలించి అధికారులకు పలు సూచించారు.

చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాజీ సిఎం చంద్రబాబు నాయుడు వాగ్దానాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. పురపాలక సంఘంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో వట్టి బూటకమని, ఆ హామీలను ప్రజలు నమ్మరని అన్నారు. 2014 ఎన్నికలలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీల్లో 25 శాతం కూడా నెరవేర్చలేదని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న వ్యక్తి సిఎం జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో చిగురుపల్లి రవికుమార్, ముద్దాడ ఈశ్వరరావు, కొప్పల ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ, గోవిందరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చింతాడ రవి

మహిళా రైతు సాధికారతకు కృషి


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ఎపిఎం కూర్మారావు

ఆమదాలవలస : గ్రామీణ ప్రాంతాల్లో స్వయం శక్తి సంఘాల మహిళలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన మహిళా రైతులను సంఘటితపరిచి వారి స్వయం ఉపాధికి ప్రభుత్వం చేదోడుగా నిలుస్తుందని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన మండల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తి, పెరటి తోటలు, కూరగాయలు పండిస్తున్న మహిళా రైతుల సాధికారతకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. స్వయం సమృద్ధి దిశగా సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకున్న, చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న, ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు సహాయం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రామప్పడు, రమణ, చందర్రావు, సుభద్ర పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేయాలని ఎంపిపి కడియాల పద్మ డాక్టర్లకు సూచించారు. మండలంలోని బెలగాం పిహెచ్‌సిలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ఉచితంగా అందిస్తున్న 2,500 చికిత్సల గురించి, నాడు-నేడు పథకంలో ప్రభుతాస్పత్రుల్లో కల్పించిన అదనపు సదుపాయాలు, అదనపు సేవలు గురించి క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకుండా, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు, డాక్టర్ రాకేష్, సిహెచ్‌ఓ ఎం.కృష్ణారావు, ల్యాబ్ టెక్నీషియన్ బెందాలం శివప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి పద్మ

చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు తగవు

కొత్తూరు : రాష్ట్ర శాసనససభ స్పీకర్ తమ్మినేని సీతారాం టిడిపి జాతీయ అధ్యక్షులు, ప్రతిపక్ష నేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు అనుచిత వ్యాఖ్యలు చేడం తగదని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. స్థానిక కలమట కాంప్లెక్స్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బ్లాక్ కామెండో సెక్యూరిటీ లేకపోతే చంద్రబాబు ఫినిష్ అనడం సరికాదన్నారు. కేంద్రం ప్రభుత్వం స్పీకర్ వ్యాఖ్యలపై విచారణ చేపట్టి చేట్టాలని కోరారు. 14 ఏళ్ల పాటు సిఎంగా పనిచేసిన చంద్రబాబుపై ఇటువంటి వాఖ్యలు శాసనసభకు అగౌవమన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పి.మోహనరావు, సర్పంచ్‌లు లోతుగెడ్డ భగవాన్ దాస్‌నాయుడు, నెల్లి అచ్యుతరావు, అగతముడి అరుణ్‌ఖుమార్, పి.అమర్, పి.మణి కంఠ, ఎం.సంతోష్, ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.


కొత్తూరు : మాట్లాడుతున్న వెంకటరమణ

శ్రీకాకుళం అర్బన్ : తెలుగుదేశం రాజకీయ భిక్షతో అత్యున్నత పదవులు అలంకరించి గౌరవాన్ని సంపాదించుకున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పదవుల కోసం విజ్ఞత మరచి చంద్రబాబు రక్షణ కోసం బ్లాక్ కమాండోస్ తొలగించాలని మాట్లాడడం అర్థరహితమని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. చంద్రబాబును అవమానిస్తూ, అక్రోషంగా మాట్లాడడం సరికాదన్నారు. స్పీకర్ వ్యాఖ్యలకు నిరసనగా టిడిపి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. స్పీకర్ చేసిన అర్థరహితమైన వ్యాఖ్యలు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు చిట్టి మోహన్, పి.ఎం.జె.బాబు, తోణంగి వెంకన్న యాదవ్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, అరవల రవీంద్ర పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ఎంపీకి సన్మానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని వింజాంపాడులో ఉన్న ఉమాసర్వేశ్వర ఆలయ బాణలింగ, వినాయకస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఉమాదేవి, అభయాంజనేయస్వామి, ఆదిత్యాధి నవగ్రహ, సదుగరు, షిర్డీ సాయినాథ్, దత్తాత్రేయ ధ్వజసంభ, నందీశ్వర ఆలయ శిఖర ప్రతిష్టాపన మహోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త చింతాడ రమణమ్మ, నూక సత్యరాజు దంపతులు, పోకల హరిబాబు ఆహ్వానం మేరకు ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు దర్శించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, టిడిపి జిల్లా యువజన కార్యదర్శి మెండ దాలినాయుడు, హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్ పూజారి శైలజలు పాల్గొన్నారు. అనంతరం ఎంపీకి దుశ్శాలువ కప్పి సన్మానించారు.


ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

రైతులపై చంద్రబాబుది కపట ప్రేమ

ఎమ్మెల్సీ శ్రీనివాస్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అధికారంలో ఉన్నప్పుడు చంద్ర బాబు వ్యవసాయమే దండగని, ఇప్పుడు రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అధికారం చేపట్టి నాలుగేళ్లలో రెండేళ్లు కరోనాతో ఇబ్బందులు పడ్డామని, మిగతా రెండేళ్లలో అనేక సంక్షేమ పథకాలు సిఎం జగన్ అమలు చేశారని అన్నారు. సచివాలయా వ్యవస్థ ఏర్పాటు చేసి రైతులు సమస్యలు లేకుండా రైతు భరోసా కేంద్రం ద్వారా సేవలందిస్తున్నారని అన్నారు. అలాగే హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసి ఆరోగ్యశ్రీ ద్వారా సేవలందిస్తున్నారని తెలిపారు. నాడు-నేడు ద్వారా విప్లవత్మక మార్పులు తెచ్చి పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. అనంతరం వైసిపి అధికారం చేపట్టి నాలుగేళ్ల సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి ప్రతినిధి మెరుగు అప్పారావు, వైస్ ఎంపిపి బోయిన నాగేశ్వరరావు, బుడ్డ మోహన్‌రెడ్డి, సతీష్, బమ్మిడి తులసిరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

విశాఖ డెయిరీ ఆధ్వర్యాన కవిటిలో 70 మంది పాడి రైతులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ సూపర్ వైజర్ కె.జి.వి.ప్రసాద్ మాట్లాడుతూ ఇచ్ఛాపురం బిసిసి పరిధిలోని 36 గ్రామాల్లో సుఖీభవ కార్డు కలిగిన 1486 మంది పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఏజెంట్ ఎస్.మహేశ్వరరావు, కార్యదర్శి శంకర్, భార్గవ్, బి.ప్రసాద్, ఆరింగి రాజు, గొండ్యాల కిరణ్ పాల్గొన్నారు.

సందడిగా వేసవి శిబిరం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ధర్మవరం శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మల్లిపెద్ది చంద్రశేఖరరావు అధ్యక్షతన వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు మంగళవారం నిర్వహించారు. పర్యవేక్షణలో జరిగింది. విద్యార్థులను ఏడు గ్రూపులుగా విభజించారు. ప్రాథమిక స్థాయి నుంచే చిత్రలేఖనం నేర్చుకోవాలన్నారు. అనంతరం విజేతలు బి.లక్ష్మీచైతన్య, బి.దినేష్ కార్తీక్, కె.గీతిక, కె.రోహిత్, ఎన్.తనూజ, బి.సునీత, ఎన్.మోహనరావు, జి.చాందిని, ఎం.దీపిక, డి.పూజిత, బి.దిలీప్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహాయకులు బి.సూర్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు ప్రకాష్, సూరిబాబు, జగదీష్, మహేష్, సురేష్, కిరణ్, శంకర్ పాల్గొన్నారు.


బలగ : నీటి కథలు చెప్తున్న విద్యార్థులు

బలగ : బలగ శాఖాగ్రంథాలయంలో బాల కథానిలయం అధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు పిల్లలకు నీతి పద్యాలు, నీతి కథలు చెప్పి వారి చేత నీతి పద్యాలు నీతి కథలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను, సహాయకులు కె.అనిత పాల్గొన్నారు

లావేరు : భారత సైనిక దళాలు భూభాగాన్ని పరిరక్షించడంతోపాటు దేశంలో శాంతిభద్రతలను కాపాడుతూ సరిహద్దుల భద్రతను పర్యవేక్షిస్తారని రిసోర్స్ పర్సన్ ఆరంగి శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా మురపాక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు ఇండియన్ ఆర్మీ ఎలా పనిచేస్తుందో వివరించారు. ప్రాథమిక స్థాయి నుంచి ఆర్మీ, మిలట్రీ గురించి తెలుసుకోవాలన్నారు. కాశ్మీర్, భారత్, పాక్ కార్గిల్ యుద్ధాల కోసం వివరించారు. సైన్యం యుద్ధ శిక్షణ ఎలా పొందుతారో ఎకె 47, వెపన్స్ యుద్ధ ట్యాంకర్ ఫిరంగల్ ఎలా పనిచేస్తాయో విద్యార్థులకు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.


టెక్కలి : ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

టెక్కలి : టెక్కలి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం సందడిగా సాగుతుంది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం ఆవరణలో విద్యార్థులకు వ్యాయమ ఉపాధ్యాయులు జయకుమార్ ఖోఖో ఆట ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్, సహాయకులు అమ్మనమ్మ, 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు.